క్లుప్తంగా

అభ్యంతరాల స్వీకరణ

భూపాలపల్లి అర్బన్: జిల్లా ఆస్పత్రిలో గతేడాది డిసెంబర్‌లో ఖాళీల భర్తీకి జారీచేసిన నోటిఫికేషన్‌లో వచ్చిన దరఖాస్తులపై అభ్యంతరాలను స్వీకరిస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తిరుపతి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంట్రాక్ట్ పతిపాదికన స్పెషలిస్ట్ డాక్టర్లు, పారా మెడికల్ స్టాఫ్ నియామకానికి దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. వచ్చిన దరఖాస్తుల ఆధారంగా ప్రొవిషనల్ మెరిట్ లిస్ట్‌ను నోటీసు బోర్డుపై ఉంచినట్లు తెలిపారు. అభ్యర్థులకు ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే ఈ నెల 24వ తేదీలోపు తెలియజేయాలని చెప్పారు.

వర్షానికి దెబ్బతిన్న రోడ్డు



మహదేవపూర్: మండలంలో కుదురుపల్లి గ్రామ సమీపంలోని జాతీయ రాహదారిపై వాగు గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఉప్పొంగి ప్రవహించింది. ఈ ప్రవాహానికి రోడ్డుపై ఉన్న వంతెన పక్కన గల రోడ్డు దెబ్బతింది. ఈ రహదారి వెంట మహారాష్ట్ర ఛత్తీస్‌గఢ్, తెలంగాణ ముడు రాష్ట్రాలను కలుపుతూ పెద్ద ఎత్తున రాకపోకలు సాగుతుంటాయి. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

హెల్మెట్ ధరించాలి



చిట్యాల: ప్రతీ వాహనాదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై జంగిలి రమేష్ తెలిపారు. మండలంలోని జూకల్‌లో శుక్రవారం వాహనాలను తనిఖీ చేశారు. 10 మంది వాహనాదారుల వద్ద సరైన పత్రాలు లేక పోవడంతో జరిమానా విధించారు. అలాగే మద్యం తాగి వాహనం నడుపుతున్న ఒకరిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది నవీన్, అస్లాంజానీ ఉన్నారు.

పేదల సంక్షేమానికి కేసీఆర్ పెద్దపీట

ఏటూరునాగారం: పేదల సంక్షేమానికి కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను జెడ్పీ చైర్‌పర్సన్ పంపిణీ చేశారు. అయినాల పావనికి రూ. 48వేల 500, వావిలాల రాములమ్మ రూ.42వేలు 500, దుబ్బ శ్రీనివాస్ రూ.37వేలు 500, పల్ల నరేష్ రూ.27వేలు 500, కుండగొర్ల రమాదేవి రూ.20 వేలు, అటిక వెంకటరమణ రూ. 18వేల విలువ గల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పాటుపడుతున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స ఎంతో మందికి ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు తెలిపారు.

పార్టీ బలోపేతానికి పాటుపడాలి

ములుగు: కార్యకర్తలు పార్టీ బలోపేతానికి పాటుపడాలని ఏఐసీసీ మహిళా ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే డాక్టర్ ధనసరి సీతక్క పిలుపునిచ్చారు. తానా సభ ల నుంచి శుక్రవారం జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయానికి చేరుకున్న సీతక్క బీసీ సంఘం నాయకులను ప్రకటించి నియామక పత్రాలను అందించారు. బీసీ సంఘం పట్టణ అధ్యక్షుడిగా గుండెబోయిన రమేశ్‌యాదవ్, మండల ఉపాధ్యక్షుడిగా బోయిని రాజు యాదవ్‌లను ప్రకటించారు.

సీతక్కకు ఘనస్వాగతం

తానా సభలకు హాజరై శుక్రవారం జిల్లాకు వచ్చిన ఎమ్మెల్యే ధనసరి సీతక్కను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీగా స్వాగతం పలికారు. గట్టమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ సీతక్కకు పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి ఆహ్వానించారు. పార్టీ ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

నిల్వ నీటిని తొలగించాలి

ఏటూరునాగారం: ఏజెన్సీ గ్రామాల్లోని ప్రజల ఇళ్ల పరిసర ప్రాంతాల్లో దోమలు నిల్వలు ఉన్న ప్రాంతాలను గుర్తించి వాటిని తొలగించాలని జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి, వైద్యాధికారి మంకిడి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండలంలోని ఎక్కెల గ్రామంలో ఫ్రైడే డ్రైడేను నిర్వహించి నిల్వ నీటిని తొలగించారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బురద నీటిలో ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. దోమ కాటుకు గురికాకుండా దోమ తెరలను వాడాలన్నారు. చెత్తాచెదారం ఇంటి చుట్టూ లేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం ఎక్కెల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో హెల్త్ క్యాంప్‌ను వైద్యురాలు సుమలత నిర్వహించి పరీక్షలు చేశారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు



తాడిచర్ల పెంజెరువు సమీపంలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్



చిన్నతూండ్లలో మృతి చెందిన ఎద్దు (ఫైల్)

మల్హర్: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ టాన్స్‌పార్మర్లు రోడ్డును అనుకోని ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పటించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. జూన్14న మల్లారం గ్రామంలో రాజబాబుకు చెందిన ఎద్దు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకి విద్యుద్ఘాతంతో మృతి చెందింది. అలాగే ఈనెల 8న చిన్నతూండ్లలో పులిగంటి రాజశేఖర్ ఎద్దు, 15న తాడిచర్ల గ్రామానికి చెందిన పార్వతి రాజమల్లు ఎద్దు, 16న పెద్ద తూండ్ల కిషన్‌రావుపల్లి గ్రామానికి చెందిన దండిగ లింగయ్య మేక కిందికి ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను తాకి అక్కడిక్కడే మృతి చెందాయి. ఇలా చాలా చోట్ల ప్రమాదకరంగా టాన్స్‌ఫార్మర్లు ఉన్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత విద్యుత్ అధికారులు కిందికి ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

భూపాలపల్లి రూరల్: నాలుగు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని బాంబుల గడ్డ ప్రాంతంలో నిస్సహాయ స్థితిలో ఉన్న పలువురికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేష్ గౌడ్ నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఉడుత ఐలయ్య (దివ్యాంగుడు), రామస్వామి లక్ష్మి(అంధురాలు), కార్పేవ్రుల ఐలయ్య(పక్షవాతం) ముగ్గురు వ్యక్తులకు అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ గౌడ్ గారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి ఆదేశాల మేరకు వర్షాల కారణంగా ఇబ్బందులు పడుతున్న వారికి నిత్యావసర వస్తువులు పంపిణీ చేసినట్లు తెలిపారు. దేవర ముత్తు, పాస్టర్ జాన్ పాల్, స్థానిక యువత పాల్గొన్నారు.



సరుకులు పంపిణీ చేస్తున్న రమేష్‌గౌడ్

అస్తవ్యస్తంగా డ్రెయినేజీ వ్యవస్థ

భూపాలపల్లి రూరల్: మున్సిపాలిటీలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు దాట్ల శ్రీనివాస్, ఉడుత సరోజన రాయమల్లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం దాదాపు సంవత్సరం నుంచి ఒక్క రూపాయి కూడా భూపాలపల్లి మున్సిపాలిటీకి నిధులు కేటాయించక పోవడం చాలా బాధాకరమన్నారు. కేటీఆర్ జిల్లాకు వచ్చినపుడు మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తామని చెప్పి ఇప్పటి వరకు ఒక రూపాయి కూడా కేటాయించలేదని వాపోయారు. జనరల్ ఫండ్‌ని దశాబ్ధి వేడుకలకు వినియోగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

జెడ్పీటీసీపై ఆరోపణలు సరికాదు



మాట్లాడుతున్న దుబాసి సమత

చిట్యాల: భూ వివాదంలో జెడ్పీటీసీ సాగర్ పేరును కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ముకిరాల మధు వంశీకృష్ణ వాడుకోవడం సరైంది కాదని చల్లగరిగ గ్రామానికి చెందిన బాధితురాలు దుబాసి సమత అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో ఆమె కుటుంబ సభ్యులతో కలిసి మాట్లాడుతూ.. తన మామ ద్వారా వారసత్వంగా చల్లగరిగ శివారులో 228,231, 232 సర్వేలో రెండు ఎకరాల 16 గుంటలు భూమిలో సాగులో ఉన్నామని తెలిపారు. తన భర్త భద్రయ్య గతంలో అనారోగ్యంతో మృతి చెందడంతో తన కుమారుడిని, కూతురుని సాదుకుంటు భూమిని సాగు చేసుకుంటు జీవనం కొనసాగిస్తున్నానని అన్నారు. కాగా 2021లో తమ ఆడపడుచు ములుగు మండలం ఇంచర్ల గ్రామానికి చెందిన ఉడుత శ్రీదేవి, అత్త దుబాసి సరోజన మమ్ముల్ని బెదిరించి అక్రమంగా పట్టా చేసుకున్నారని తెలిపారు. పసుపు కుంకుమల కింద ఇచ్చిన భూమి అని తమ అత్త గారు చెప్పడం అవాస్తవం అని అన్నారు. ఆ భూమిలో రెండు సంవత్సరాల నుంచి పెద్ద మనుషుల సహకారంతో పంచాయితీ జరుగుతుందని పేర్కొన్నారు. జీవనోపాధి కోసం తన కుమారుడు జెడ్పీటీసీ గొర్రె సాగర్ వద్ద కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడని, భూమి విషయంలో శ్రీదేవి, సరోజన చేసిన ఆరోపణలకు జెడ్పీటీసీకి ఎలాంటి సంబంధం లేదని అన్నారు. తన కుమారుడు జెడ్పీటీసీ దగ్గర పని చేస్తుడడంతో కాంగ్రెస్ నాయకులు ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



మహదేవపూర్: పరామర్శిస్తున్న ఎమ్మెల్యే



మొగుళ్లపల్లి: పరామర్శిస్తున్న నాగుర్ల

మహదేవపూర్: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సినియర్ నాయకుడు సలామ్ కూతురు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు శుక్రవారం పరామర్శించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాపు, మండల అధ్యక్షుడు అక్బర్ ఖాన్, యుత్ నాయకుడు సోహెల్, షహీన్ తదితరులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: మొగుళ్లపల్లి సర్పంచ్ మోటే ధర్మారావు తల్లి రాధబాయ్ శుక్రవారం మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని రైతు విమోచన కమిటీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్‌రావు పరామర్శించారు. ఆయన వెంట జెడ్పీటీసీ జోరుక సదయ్య, సర్పంచ్‌లు చదువు అన్నారెడ్డి, కోడారి సునీతరమేష్, నైనకంటి ప్రభాకర్‌రెడ్డి, కోసుకటి అరవింద్, పెంతల రాజేందర్ ఉన్నారు.

విద్యుత్ మోటార్ల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న విద్యుత్ మోటార్లు

టేకుమట్ల(రేగొండ): చోరీకి గురైన విద్యుత్ మోటార్లను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు రేగొండ ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. రేగొండ మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన నలుగురు రైతులు జయ్యారపు సదయ్య, బానోతు మొగిళి, జయ్యారపు వెంకన్న, వేముల రవి ఎస్సారెస్పీ కెనాల్‌పై ఏర్పాటు చేసుకున్నారు. కాగా, విద్యుత్ మోటార్లను రేగొండ మండల కేంద్రానికి చెందిన చల్ల బత్కయ్య, చల్ల నరేందర్, మేకల శివ, మద్ది చందులు జల్సాలకు పాల్పడి, మద్యం మత్తులో చోరీలకు పాల్పడ్డారు. బాధిత రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, అనుమానితులపై దర్యాప్తు చేపట్టగా విద్యుత్ మోటార్లను చోరీ చేసినట్లుగా అంగీకరించడంతో నాలుగు విద్యుత్ మోటార్లను స్వాధీనం పర్చుకుని, చోరీకి వినియోగించిన ఆటోను సీజ్ చేసి, వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి



వృద్ధుడి మృతదేహం

గణపురం: మండలంలోని చెల్పూరు గ్రామ పచాయతీ పరిధిలోని కుందూరుపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో గుర్తు తెలియని వృద్ధుడు(60) అనుమనాస్పద స్థితిలో మృతి చెందాడు. పాఠశాల వద్దకు వెళ్ళిన కొందరికి రక్తపు మరుకలతో మృతి చెందిన వృద్ధుడి మృతదేహం కనిపించడంతో స్థానిక పోలీసులకు శుక్రవారం సమాచారం అందజేశారు. ఘటన స్థలానికి వెళ్లిన పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు స్థానికుడు కాకపోవడంతో అతని వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని 100 పడకల ఆస్పత్రికి తరలించి భద్రపరుచారు. మృతుడిని ఎవరైన గుర్తిస్తే గణపురం ఎస్సై అభినవ్ ఫోన్ నం.8712658122 కు లేదా చిట్యాల సీఐ వేణుచందర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య



ప్రవీణ్ (ఫైల్)

టేకుమట్ల: క్రిమిసంహారక మందు తాగి యువకుడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన టేకుమట్ల మండలంలోని రామకిష్టాపూర్(టీ)లో శుక్రవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం.. రామకిష్టాపూర్(టీ) గ్రామానికి చెందిన కొడగాని కిషన్‌రావు–రాజమణి దంపతులకు ముగ్గురు కుమారులు కాగా రెండవ కుమారుడు ప్రవీణ్(28) చదువు మధ్యలోనే ఆపేసి తండ్రితో పాటు వ్యవసాయ పనులను చేసుకుంటూ, తన కున్న ట్రాక్టర్‌ను నడుపుకుంటున్నాడు. కాగా గురువారం సాయంత్రం వ్యవసాయ భూమిలోకి వెళ్లి పురుగుల మందు తాగి మిత్రుడికి సమాచారం అందించాడు. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం చిట్యాల సివిల్ ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రాథమిక చికిత్స అందించి, మెరుగగైన చికిత్స కోసం పరకాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్సనందిస్తుండగా చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు తెలిపారు.

ఇప్పగూడెంలో వైద్యశిబిరం

వాజేడు: మండల పరిధిలోని ఇప్పగూడెం గ్రామంలో శుక్రవారం వాజేడు వైద్యాధికారి కొమరం మహేందర్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. పరివురిని పరీక్షించి అవసరం ఉన్న వారికి మందులను అందజేసి గర్భిణులను పరీక్షించారు. అనంతర ఇంటింటి సర్వే నిర్వహించి డ్రైడే, ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు.

కొనసాగుతున్న కార్మికుల సమ్మె



భూపాలపల్లి రూరల్: మోకాళ్లపై నిరసన తెలుపుతున్న కార్మికులు

భూపాలపల్లి రూరల్: గ్రామపంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట చేస్తున్న సమ్మె శుక్రవారం నాటికి16వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్మికులు, ఉద్యోగులు మోకాళ్లపై నిలుచుని ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికుల సంఘం జాక్ నాయకులు కుడుదుల వెంకటేష్, చెన్నూరు రమేష్ మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాళ్లపల్లి శ్రీధర్‌గౌడ్, నందు నాయక్, భాస్కర్ రాజ్ కుమార్, నరేష్ పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని ఎంపిడివో కార్యాలయం ముందు పంచాయతీ సిబ్బంది చేస్తున్న సమ్మె శుక్రవారం16వ రోజుకు చేరుకుంది. మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు వంటావార్పు కార్యక్రమం నిర్వహించి ఒంటి కాలుపై కూర్చోని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు బైరగోని కుమారస్వామి మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న సిబ్బందిని పర్మినెంట్ చేయాలని సిబ్బంది వేతనాల కోసం ప్రత్యేక గ్రాంటు కేటాయించాలన్నారు. జీఓ 51ను సవరించి మల్టీవర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఉద్యోగులు క్యాతరాజు రాజయ్య, అబ్బు, మ్యాదరి రమేష్, జగన్నాథం, శ్రీరాం కృష్ణయ్య, చేలిక సురేష్, తదితరులు పాల్గొన్నారు.



మొగుళ్లపల్లిలో..

కిషన్‌రెడ్డిని కలిసిన నాయకులు



కిషన్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని జిల్లా బీజేపీ నాయకులు శుక్రవారం కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి, వరంగల్ పార్లమెంట్ కో–కన్వీనర్ చాడ రఘునాథ్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ముడుపు అశోక్‌రెడ్డి, జిల్లా కార్యదర్శులు సుంకరి మనోహర్, మోర్తాల రాజేందర్, బీజేవైఎం రాష్ట్ర నాయకులు సయ్యద్ గాలిఫ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దొంగల రాజేందర్, ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకులు బట్టు రవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న సభ్యులు

పలిమెల: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పంకెన గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన కాల్వపెల్లి పోచయ్య ఇల్లు గోడ, పైకప్పు కూలిపోయింది. దీంతో నిరాశ్రయులైన కుటుంబానికి శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి ఆర్థిక సాయం, నిత్యావసర సరుకులు అందించారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు మస్కరాజు, బల్ల సంపత్,వెన్నెల రాకేష్, ఊదరి హరీష్, ముద్రగడ సాయితో పాటు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో జీవాలు మృతి



భూపాలపల్లి రూరల్: విద్యుదాఘాతంలో మూగ జీవాలు రెండు గొర్రెలు, ఒక మేక మృతి చెందిన సంఘటన శుక్రవారం మండలంలోని పంబాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొమ్ముసతీష్ యాదవ్ గొర్రెలను పంబపూర్ శివారులో మేపుతున్నాడు. ఈ క్రమంలో ట్రాన్స్‌ఫారానికి వచ్చే 11 కేవీ కరెంట్ వైరు మూగజీవాలపై తెగి పడింది దీంతో రెండు గొర్రెలు, ఒక మేక విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడే మృతి చెందినట్లు తెలిపారు. వీటి విలువ సుమారుగా రూ.45వేలు ఉంటుందని తెలిపారు. అధికారులు స్పందించి రైతును ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ముంపు బాధితులతో మాట్లాడుతున్న రెవెన్యూ సిబ్బంది

భూపాలపల్లి రూరల్: ముంపు ప్రాంతాల గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల రెవెన్యూ అధికారులు అవగహన కల్పిస్తున్నారు. శుక్రవారం మండలంలోని కమలాపూర్ గ్రామంలోని ముంపు ప్రాంతంలో నివసిస్తున్న ఐదు కుటుంబాలకు ప్రమాద హెచ్చరికలు జారీ చేసి అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అదేవిధంగా మండలంలోని నాగారం గ్రామంలో చెరువును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేరుగా వేతనాలు అందించాలి



తిరుపతికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

చిట్యాల: ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేసి ప్రభుత్వమే నేరుగా వేతనాలు అందించాలని మెడికల్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కట్కూరి నరేందర్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైద్యశాఖలో చాలీ చాలని వేతనాలతో పని చేస్తున్న వారికి ఏజెన్సీ నెల, నెలా వేతనాలు అందించకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కావున ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేసి, వైద్యశాఖలో పని చేస్తున్న వారికి నేరుగా వేతనాలు అందిస్తూ ఈఎస్ఐ, పీఎఫ్‌ను చెల్లించాలని కోరారు. అనంతరం చిట్యాల సివిల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ జీడి తిరుపతికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు అంకం కిషోర్, బిట్ల రమణ, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ విజయానికి కృషి



ఎన్నికైన గ్రామ కమిటీతో జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి

చిట్యాల: కాంగ్రెస్ పార్టీ విజయానికి మహిళలు కృషిచేయాలని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు గుమ్మడి శ్రీదేవి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని ఒడితలలో మహిళా కాంగ్రెస్ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న రోజుల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. నియంత పాలనకు చరమగీతం పాడేందుకు ప్రతీ మహిళా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. గ్రామ కమిటీ అధ్యక్షురాలిగా మీరుపూరి మౌనిక, ప్రధాన కార్యదర్శిగా కొటం శాంతక్క, ఉపాధ్యక్షులుగా పట్టెం సరోజన, సహాయ కార్యదర్శిగా మేరుగు శ్వేత, కోశాధికారిగా కాంపెల్లి వినోద, కార్యవర్గసభ్యులుగా శారద, తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎర్రబెల్లి భద్రమ్మ, కాంగ్రెస్ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.